సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 3 । జూన్ । 2023



'డబుల్ ఇంజన్'తోనే సుభిక్షం

తెలంగాణ సుభిక్షంగా ఉండాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని బీజేపీ నేత నిర్మల్ కుమార్ పేర్కొన్నారు. 8లో



పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం

ఖరీఫ్ సీజన్ ప్రారంభంకానున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉంచారు. 10లో

గరిష్టం / కనిష్టం
42° / 28°

వాతావరణం

జిల్లాలో శనివారం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం పూజలు వైభవంగా నిర్వహించారు. మండల పరిధిలోని పెద్దమ్మతల్లి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి అర్చకులు పంచామృతంతో అభిషేకం జరిపారు. ముందుగా మేళ తాళాలతో అమ్మవారి జన్మస్థలం వద్ద అర్చకులు పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం మూలవిరాట్ అమ్మవారికి అభిషేకం, నివేదన, పంచహారతులు, నీరాజన మంత్రపుష్పార్చన నిర్వహించారు. పూజా కార్యక్రమంలో వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు పురాణం రవికుమార్ శర్మ, దుర్గాప్రసాద్ శర్మ, ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయపాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు గవర్నర్ సన్మానం

తిప్పన సిద్ధులుకు దక్కిన గౌరవం



తిప్పన సిద్ధులును శాలువాతో సత్కరిస్తున్న రాష్ట్ర గవర్నర్ తమిళిసై

భద్రాచలంఅర్బన్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని 1969లో ఉద్యమాన్ని భుజాలకెత్తుకున్న ఆనాటి ఉద్యమ నేతలకు, తెలంగాణవాదులను రాజ్‌భవన్‌లో శుక్రవారం ఘనంగా సన్మానించారు. భద్రాచలం వాసి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు తొలిదశలో ఉద్యమంలో కీలకంగా పనిచేశారు. మలిదశ ఉద్యమంలో కూడా తనవంతు పాత్ర పోషించారు. ఆయన ఉద్యమస్ఫూర్తికి సంబంధించిన విషయాలను పాఠ్యాంశాల్లో కూడా చేర్చారు. ఈ నేపథ్యంలో ఆయన్ను రాజ్‌భవన్‌కు ఆహ్వానించి సన్మానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వారు చేసిన కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా సిద్ధులుకు పట్టణ పుర ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు అభినందనలు తెలిపారు.

ప్రధాన రహదారి విస్తరణ..



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా

అశ్వారావుపేటరూరల్: పట్టణంలోని పోలీస్ స్టేషన్ సెంటర్‌లో భద్రాచలం రోడ్‌లో నాలుగు లేన్ల రహదారి విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులను శుక్రవారం ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులకు రూ.20.75 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. నియోజకవర్గ కేంద్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ సీహెచ్ వరలక్ష్మి, ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు చేయాలి

కొత్తగూడెంఅర్బన్: దశాబ్ది ఉత్సవాల్లో ప్రతీ కార్యక్రమం పండుగ వాతావరణంలో జరిగేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అనుదీప్ తెలిపారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయం నుంచి శనివారం నిర్వహించనున్న రైతు దినోత్సవం తదితర కార్యక్రమాలపై రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యాన, పంచాయతీ రాజ్, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు రైతులు ఎడ్ల బండ్లతో, ట్రాక్టర్లతో రైతు వేదికలకు చేరుకోవాలని, మధ్యాహ్నం భోజన వసతి కూడా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం రాకుండా జనరేటర్ అందుబాటులో ఉంచాలని చెప్పారు. వైద్య సిబ్బంది, మందులను అందుబాటులో ఉంచాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రొటోకాల్ సమస్య రాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో కొత్తపుంతలు..



కలెక్టరేట్‌లో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ కాంతారావు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న రేగా





కొత్తగూడెం కూరీలైన్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

పూర్తయిన సీతారామ ఎత్తిపోతల పథకం పనులు

- ప్రభుత్వం తేదీ ప్రకటించగానే పోడు పట్టాల పంపిణీ
- దశాబ్ది ఉత్సవాలను పండుగలా నిర్వహించాలి
- రాష్ట్ర అవతరణ వేడుకలో ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

కొత్తగూడెంఅర్బన్: ఉద్యమాలు, త్యాగాల ఫలితంగా, నీళ్లు, నిధుల కోసం సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం, పరిపాలన కొత్తపుంతలు తొక్కుతోందని రాష్ట్ర ప్రభుత్వ విప్ రేగా కాంతారావు పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఐడీఓసీ సమావేశపు హాలులో హై టీ(తేనీటి విందు) కార్యక్రమం నిర్వహించారు. తొలుత కొత్తగూడెం పట్టణంలోని ప్రగతి మైదానంలో అమరవీరుల స్తూపానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఎందరో విద్యార్థులు, తెలంగాణవాదులు అమరులయ్యారని గుర్తుచేశారు. నాటి ఉద్యమ ఫలితాలు నేడు అనుభవిస్తున్నామని తెలిపారు. జిల్లాలో భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్, మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. సీఎం కేసీఆర్ దేశానికే రోల్ మోడల్‌గా నిలిచారని పేర్కొన్నారు. ఈ నెల 22వ తేదీ వరకు అవతరణ వేడుకలు ఘనంగా నిర్వహించాలని చెప్పారు.

రైతుబంధు రూ.205 కోట్లు

జిల్లాలో రైతుబంధు ద్వారా వేసవిలో లక్షా 34 వేల 764 మంది రైతులకు రూ.205.18 కోట్లు అందించినట్లు తెలిపారు. సాగుపై రైతులకు అవగాహన కల్పించేందుకు 67 రైతు వేదికలు నిర్మించినట్లు తెలిపారు. 55,301 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతోందని పేర్కొన్నారు. ధరణి ద్వారా ఇప్పటివరకు 2,175 సేల్ రిజిస్ట్రేషన్లు, 369 గిఫ్ట్ రిజిస్ట్రేషన్లు, వెయ్యి 767 సక్సేషన్లు, 278 పార్టీషన్లు, 569 నాలా కన్వర్షన్లు, 454 పెండింగ్ మ్యుటేషన్లు, 128 మార్టిగేజ్‌లు పూర్తి చేశామని వివరించారు.

సీతారామ పనులు నూరుశాతం పూర్తి

జిల్లాతో పాటు ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో 6 లక్షల 74 వేల ఎకరాలకు సాగునీరందించేందుకు 13 వేల 58 కోట్ల రూపాయలతో చేపట్టిన సీతారామ ఎత్తిపోతల పథకం పనులు నూరుశాతం, పంట కాల్వల పనులు 95 శాతం పూర్తయ్యాయని, సత్తుపల్లి ట్రంక్ కెనాల్ పనులు పురోగతిలో ఉన్నాయని పేర్కొన్నారు. గొర్రెల పెంపకదారుల అభివృద్ధి పథకంలో సభ్యులైన 7,511 మందికి 75 శాతం సబ్సిడీతో గొర్రెల యూనిట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని 2,93,667 కుటుంబాలు రేషన్ కార్డుల ద్వారా లబ్ధిపొందుతున్నారని అన్నారు.

ప్రతి నెలా రూ.26.21 కోట్లతో పింఛన్

మిషన్ భగీరథ కార్యక్రమం ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నట్లు, మారుమూల గ్రామాలైన రాళ్లపురం, ఎర్రంపాడులకు సురక్షిత మంచినీరు సరఫరా చేస్తున్నట్లు వివరించారు. ఉపాధి హామీ పథకం ద్వారా 10.84లక్షల పని దినాలు కల్పించి రూ.21.86 కోట్ల చెల్లింపులు చేశామని పేర్కొన్నారు. కోటి 19 వేల 670 మందికి ప్రతి నెలా రూ.26.21 కోట్లను ఆసరా పింఛన్ సొమ్ము అందిస్తున్నట్లు తెలిపారు. 38 పరిశ్రమలకు అవసరమైన 64 అనుమతులు మంజూరు చేశామని, పరిశ్రమల పెట్టుబడి రూ.119 కోట్లు కాగా 311 మందికి ఉపాధి కల్పించామని చెప్పారు.

పెరిగిన పారిశుద్ధ్య ప్రమాణాలు..

పట్టణ ప్రగతి కార్యక్రమాల్లో భాగంగా పారిశుద్ధ్య ప్రమాణాలు పెరిగాయని అన్నారు. సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ల నిర్మాణం తదితర పనులతోపాటు నాలుగు మున్సిపాలిటీలకు సీఎం ప్రత్యేకంగా రూ.130 కోట్లు నిధులు మంజూరు చేయగా చేపట్టాల్సిన పనులకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఇంకా వివిధ శాఖలవారీగా సాధించిన పురోగతిని విప్ కాంతారావు వివరించారు. కొత్తగూడెం, ఇల్లెందు శాసన సభ్యులు వనమా వెంకటేశ్వరరావు, హరిప్రియ, కలెక్టర్ అనుదీప్, ఎస్పీ డాక్టర్ వినీత్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు రావు జోగేశ్వరరావు, గ్రంథలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

50,595 మందికి పోడు పట్టాలు..

50,595 మందితో పోడు హక్కు పత్రాల అర్హుల జాబితా సిద్ధం చేశామని పేర్కొన్నారు. ప్రభుత్వం తేదీ ప్రకటించగానే పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. పోడు భూముల సమస్యను పరిష్కరిస్తూనే, అటవీ భూములను రక్షిస్తూ దట్టమైన అడవులను పునరుజ్జీవింప చేయనున్నామని తెలిపారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో రూ.37.51 కోట్ల విలువైన పనులు పూర్తి చేశామన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో 11 వేల 79 మందికి న్యూట్రిషన్ కిట్లు, 45 వేల 768 మందికి కేసీఆర్ కిట్లను పంపిణీ చేశామని వివరించారు. 4 లక్షల 50 వేల మందికి కంటి వెలుగు పరీక్షలు నిర్వహించామని, 90 వేల 429 మందికి రీడింగ్, 54 వేల 389 మందికి ప్రిస్కిప్షన్ కంటి అద్దాలు పంపిణీ చేశామని పేర్కొన్నారు.



అమరవీరుల స్తూపంవద్ద నివాళులర్పిస్తున్న విప్ రేగా, ఎమ్మెల్యేలు వనమా, హరిప్రియ, కలెక్టర్, ఎస్పీ

రైతన్నకు భరోసా

- ప్రభుత్వ పథకాలతో సాగుకు చేయూత
- రైతుబంధుతో పెట్టుబడి సాయం.. బీమాతో ధీమా
- ఉచిత విద్యుత్‌తో పంటలకు ఊపిరి
- నేడు రైతు దినోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు



పంటలు సాగు చేస్తున్న రైతులు (ఫైల్)

బూర్గంపాడు: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం రైతన్నకు భరోసానిచ్చింది. పంటల సాగుకు 24 గంటల విద్యుత్ సరఫరా, మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్ధరణ, రైతు బంధు, రైతు బీమా పథకాలు, రైతు వేదికలు, ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మార్కెటింగ్ గిడ్డంగులు తదితర సదుపాయాలు రైతులకు ఉపయోగకరంగా మారాయి. స్వరాష్ట్రం ఏర్పడక ముందు జిల్లాలో 1.21 లక్షల ఎకరాల్లో ఉన్న వరిసాగు ప్రస్తుతం 1.64 ఎకరాలకు పెరిగింది. 1.46 లక్షల ఎకరాల్లో ఉన్న పత్తి సాగు ప్రస్తుతం 1.98 లక్షల ఎకరాలకు విస్తరించింది. గతంలో జిల్లాలో కేవలం 6 వేల ఎకరాల్లోనే సాగైన మిర్చి ప్రస్తుతం 20వేల ఎకరాలకు పైగా పెరిగింది. తెలంగాణ రాకముందు జిల్లాలో 17 వేల ఎకరాల్లోనే సాగైన ఆయిల్‌పామ్ ప్రస్తుతం 55 వేల ఎకరాలు దాటింది. ఆయిల్‌పామ్ సాగులో రాష్ట్రంలో భద్రాద్రి జిల్లా తలమానికంగా ఉంది. గతంలో 16.6 వేల ఎకరాల్లో సాగైన ఉద్యానవన పంటలు ప్రస్తుతం 42వేల ఎకరాలకు పెరిగాయి. ప్రభుత్వ ప్రోత్సాహంతోనే జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం ప్రతి ఏటా పెరుగుతోంది. కాగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకుని శనివారం జిల్లా వ్యాప్తంగా రైతు దినోత్సవం నిర్వహణకు అధికారుల ఏర్పాట్లు పూర్తి చేశారు.

- పంటల సాగు పెట్టుబడి కోసం ప్రభుత్వం నుంచి జిల్లాలో 1.34 లక్షల మంది రైతులు రైతుబంధు పొందుతున్నారు. ప్రతి వ్యవసాయ సీజన్‌లో రూ. 205.18 కోట్ల పెట్టుబడిసాయం అందుతోంది. 2018 వానాకాలం నుంచి 2022 యాసంగి వరకు 10 విడతల్లో రూ.1,725.46 కోట్లు అందించారు.
- రైతుబీమా కుటుంబానికి ప్రభుత్వం రూ. 5 లక్షల ఆర్థికసాయాన్ని అందిస్తోంది. జిల్లాలో 2018 నుంచి 2022 వరకు 2,928మంది రైతులు వివిధ కారణాలతో మృతి చెందగా, ఆయా కుటుంబాలకు రూ.138.20 కోట్ల బీమా సొమ్ము అందించారు.
- వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా 50శాతం రాయితీతో 14,923మంది రైతులకు ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయ పనిముట్లను అందించారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.2,125.96 కోట్ల రాయితీ అందించింది.
- రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచేందుకు పచ్చిరొట్ట కింద సాగుకు జనుములు, జీలుగులు, పిల్లిపెసర విత్తనాలను 65శాతం రాయితీతో ప్రతిఏటా 10,615మంది రైతులకు రూ.2.40 కోట్ల రాయితీతో అందిస్తున్నారు.
- ఏటా రైతులకు ఇబ్బందులు కలుగకుండా పంటల వారీగా 5.05 లక్షల ఎకరాల సాగుకు అవసరమైన ఎరువులను వ్యవసాయశాఖ ముందస్తు ప్రణాళికలతో సమకూర్చుతోంది.
- ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది. క్షేత్రస్థాయిలో కొన్ని ఇబ్బందులున్నప్పటికీ కొనుగోలు కేంద్రాలతోనే రైతులకు మద్దతు ధర లభిస్తోంది. ఇక కరోనా కష్టకాలంలో గ్రామాలకు, పొలాలకు వెళ్లి ధాన్యం కొనుగోలు చేసి రైతులను ప్రోత్సహించారు.

ఆశయాలు సాధించాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్

కొత్తగూడెంటౌన్: అమరవీరులు ప్రాణత్యాగం చేసి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో వారి ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ అన్నారు. శుక్రవారం జిల్లా కోర్టులో తెలంగాణ దశాబ్ది సంబురాల్లో భాగంగా జాతీయ జెండా ఎగురవేసి జెండా వందనం చేశారు. అనంతరం అమరవీరులకు నివాళులర్పించారు. ఆ తర్వాత కోర్టు హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ పదో వసంతంలో అడుగు పెడుతున్న తెలంగాణ ఇంకా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. రాష్ట్ర సాధనలో న్యాయవాదుల పాత్ర కూడా ఉందని గుర్తుచేశారు. నీళ్లు, నిధులు, నియామకాలు అందరికీ సక్రమంగా అందాలని, గ్రామస్థాయి వరకు మెరుగైన వైద్యసదుపాయం అందించాలని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్

ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు ఎం.శ్యాంశ్రీ, జి.భానుమతి, ఆడెపు నీరజ, ఏ.సుచరిత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌కుమార్ మక్కడ్ తోపాటు రావిలాల రామారావు, పిట్టల రామారావు, యుగంధర్, కాసాని రమేష్, ఎస్.ఎన్ సాహూ, వేపాక వెంకటరత్నం, పలివేల సాంబశివరావు, కటకం పుల్లయ్య, పురుషోత్తమరావు, నిరంజన్, ఏపూరి బాబూరావు, రాధాకృష్ణమూర్తి, లక్ష్మి, లావణ్య, అనితావాణి, మెండు రాజమల్లు పాల్గొన్నారు.

రామాలయంలో 'దశాబ్ది ఉత్సవాలు'

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా జరిపారు. ఆంతరంగికంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. సువర్ణ పుష్పార్చన గావించారు. యాగశాలలో సుదర్శన హోమం, సుదర్శన పూజలను అర్చకులు జరిపారు. కాగా ఈవో కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఈఓ రమాదేవి ఎగురవేశారు. అనంతరం దశాబ్ది కాలంలో తెలంగాణలో జరిగిన అభివృద్ధిని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఈ రవీందర్, ఆలయ ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణకవచాలతో రామయ్య..

అంతరాలయంలో శుక్రవారం సందర్భంగా మూలమూర్తులను స్వర్ణకవచాలతో అలంకరించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలను గావించారు.



జాతీయ జెండాను ఎగురవేస్తున్న దేవస్థానం ఈఓ రమాదేవి

బీఆర్‌ఎస్ పాలన ఐదు నెలలే..

పినపాక: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలన ఐదు నెలలే ఉంటుందని, అనంతరం మన ప్రభుత్వం ఏర్పడుతుందని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలో పర్యటించిన ఆయన బీటీపీఎస్ ఎదుట కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన దీక్షలో కూర్చుని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఐదు రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. కార్మికులతో వెట్టిచాకిరీ చేయిస్తూ న్యాయమైన జీతాలు అందించడం లేదని ఆరోపించారు. కాంట్రాక్ట్ కార్మికులకు తాను అండగా ఉంటానని తెలిపారు. అనంతరం మండలంలోని సింగిరెడ్డిపల్లి, పాత రెడ్డిపాలెం, దేవనగరం గ్రామాల్లో పర్యటించి పలు ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన..

అశ్వాపురం: మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామంలో గంగమ్మ తల్లి ఆలయం నిర్మాణానికి శుక్రవారం ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, తెల్లం వెంకట్రావు, ఎంపీపీ ముత్తినేని సుజాత, మాజీ సర్పంచ్ పొడియం అనిల్, నాయకులు ముత్తినేని వాసు, బండారు జనార్దన్, బొబ్బాల నాగేశ్వరరావు, బొల్లినేని గణేష్, ఆలయ నిర్మాణ కమిటీ బాధ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ పొంగులేటి

వైద్యసేవలు మెరుగు..

- జిల్లా కేంద్రంలో మెడికల్, నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు
- నాలుగు ప్రభుత్వాస్పత్రులు అప్‌గ్రేడ్..
- కార్పొరేట్ హాస్పిటళ్లకు వెళ్లకుండా ఇక్కడే వైద్యం

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక జిల్లాలో వైద్య సేవలు మెరుగుపడ్డాయి. 2022 సంవత్సరంలో కొత్తగూడెంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయగా, గత నవంబర్ 15 నుంచి ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభించారు. 150 మంది విద్యార్థులు వైద్య విద్య అభ్యసిస్తున్నారు. ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ మొత్తం కలిపి 64 మంది పని చేస్తున్నారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ కళాశాలలకు అసిస్టెంట్ ప్రొఫెసర్లను కేటాయించగా, ఇక్కడికి మరో 43 మంది రానున్నారు. కళాశాలకు అనుసంధానంగా 350 బెడ్లతో సర్వజన, మాతా శిశు ఆస్పత్రులను అందుబాటులోకి తీసుకొచ్చారు. వీటిల్లో గర్భిణులు, బాలింతలు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లకుండా ఖరీదైన వైద్యం ఉచితంగా అందిస్తున్నారు. గర్భిణులకు సిజేరియన్ చేయకుండా నార్మల్ డెలివరీలు చేసేందుకు సిబ్బంది కృషి చేస్తున్నారు. దీంతో ఆస్పత్రికి గర్భిణులు, బాలింతలు అధిక సంఖ్యలో వస్తున్నారు. పుట్టిన శిశువులకు కూడా అత్యాధునిక పరికరాలతో మెరుగైన చికిత్స అందిస్తున్నారు. జిల్లా సర్వజన ఆస్పత్రిలో సిటీ స్కానింగ్, కేన్సర్‌కు సంబంధించిన స్కానింగ్‌లు, రక్త పరీక్షలు, అరుదైన ఆపరేషన్ల సంఖ్య కూడా పెరిగింది. మొత్తంగా జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి.


ఆస్పత్రుల అప్‌గ్రేడేషన్..

రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని మణుగూరు, ఇల్లెందు, బూర్గంపాడు, అశ్వారావుపేట ఆస్పత్రులను అప్‌గ్రేడ్ చేసింది. దీంతో సదుపాయాలు, వైద్య సేవలు మెరుగుపడ్డాయి. అత్యవసర వైద్యం సైతం ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లకుండా స్థానికంగానే అందుతోంది. ఆస్పత్రుల్లో డయాలసిస్ సెంటర్లు, డయాగ్నోస్టిక్ సెంటర్లు అందుబాటులోకి వచ్చాయి. దీంతో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి వేల రూపాయల ఖర్చు పెట్టే పరిస్థితి లేకుండాపోయింది. రోడ్డు ప్రమాదాలు, గుండె, ఊపిరితిత్తుల సమస్యలు తలెత్తినప్పుడు ఖమ్మం, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు మెడికల్ కళాశాల, మాతాశిశు సంక్షేమ ఆస్పత్రి ఏర్పాటుతో ఇక్కడే వైద్యం అందుతోంది.



కొత్తగూడెం మెడికల్ కళాశాల

మరికొందరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు..



కొత్తగూడెం మెడికల్ కళాశాలకు 43 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు రానున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వివిధ మెడికల్ కళాశాలలకు బోధనా సిబ్బందిని కేటాయించింది. ప్రస్తుతం కళాశాలలో 64 మంది టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పని చేస్తున్నారు. ఎంబీబీస్ విద్యార్థులు ఎటువంటి అసౌకర్యం లేకుండా విద్యనభ్యసిస్తున్నారు.

–లక్ష్మణ్‌రావు,
కొత్తగూడెం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్

నర్సింగ్ కళాశాల ప్రారంభం

కొత్తగూడెంలో నర్సింగ్ కళాశాల సైతం ప్రారంభమైంది. 2022–23లో 58 మంది నర్సింగ్ విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థులకు ప్రతి నెలా రూ.5 వేల చొప్పున అందిస్తున్నారు. గతంలో రూ.వెయ్యి మాత్రమే ఉండేది. టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్ 30 మంది వరకు పని చేస్తున్నారు. ఎంసెట్ కౌన్సెలింగ్ ద్వారా ఏడాది నూతన బ్యాచ్ కళాశాలకు రానున్నారు.



కొత్తగూడెంలోని నర్సింగ్ కళాశాల

క్లుప్తంగా

అక్రమంగా తరలిస్తున్న పశువులు గోశాలకు..


గోశాలకు అప్పగించిన గోవులు

పాల్వంచ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం హనుమాన్ జంక్షన్ నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న గోవులను పట్టుకున్న అక్కడి పోలీసులు వాటిని పాల్వంచ అన్నపూర్ణ గోశాలలో అప్పగించారు. గురువారం రాత్రి ఎలాంటి అనుమతులు లేకుండా మూడు లారీల్లో 139 గోవులను తరలిస్తుండగా నూజివీడు రూరల్ పోలీసులు పట్టుకున్నారు. వాటిని శుక్రవారం తెల్లవారుజామున పాల్వంచలోని గోశాలకు అప్పగించినట్లు నిర్వాహకులు ఆంజనేయశర్మ తెలిపారు. వాటిలో 32 ఆవుల పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు.

కారు బోల్తాపడి ఇద్దరికి గాయాలు

అశ్వాపురం: మండలంలోని మొండికుంట – నెల్లిపాకబంజర గ్రామాల మధ్య మల్లెలమడుగు గ్రామ శివారులో శుక్రవారం కారు బోల్తా పడి ఇద్దరికి తీవ్రంగా గాయాలయ్యాయి. భద్రాచలం నుంచి కారులో అశ్వాపురం వస్తుండగా మల్లెలమడుగు గ్రామ శివారులో కారు అదుపుతప్పడంతో ఈ ప్రమాదం జరిగింది. కారులో ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో ఇరువురు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

ములకలపల్లి: చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన కొత్తగంగారంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కొత్తగంగారం గ్రామానికి చెందిన ఇనికె సుధాకర్ (39) గురువారం గ్రామశివారులోని చింతలచెరువులో చేపలవేటకు వెళ్లాడు. రాత్రి వరకూ ఇంటికి చేరకపోవడంతో కుటుంబీకులు సమీప ప్రాంతంలో గాలించినా జాడ తెలియలేదు. శుక్రవారం ఉదయం చెరువులో సుధాకర్ మృతదేహం లభించింది. మృతుడికి భార్య దుర్గ, ఇద్దరు పిల్లలున్నారు.

వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

బూర్గంపాడు: గోదావరి బ్రిడ్జిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఓ గుర్తు తెలియని వ్యక్తి బ్రిడ్జిపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం అతడిని ఢీకొట్టింది. ఈ ఘటనలో సదరు వ్యక్తి శరీరం మొత్తం ఛిద్రమై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. సారపాక గ్రామ పంచాయతీ సిబ్బంది సాయంతో మృతదేహాన్ని బూర్గంపాడు మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

18 కేజీల గంజాయి స్వాధీనం

టేకులపల్లి: అక్రమంగా తరలిస్తున్న గంజాయిని టేకులపల్లి పోలీసులు పట్టుకున్నారు. టేకులపల్లి ఎస్‌ఐ రమణారెడ్డి కథనం ప్రకారం.. శుక్రవారం భద్రాచలం నుంచి ద్విచక్ర వాహనాలపై అక్రమంగా గంజాయి తరలిస్తున్నారనే సమాచారం రావడంతో ఎస్‌ఐ రమణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు తొమ్మిదోమైలుతండా సమీపంలో వాహన తనిఖీలు చేపట్టారు. రెండు ద్విచక్ర వాహనాలపై అనుమానం రావడంతో తనిఖీ చేయడంతో సుమారు 18 కేజీల గంజాయి దొరికింది. దీంతో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రెండు ద్విచక్ర వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన ముగ్గురు వ్యక్తులు హైదరాబాద్‌లోని ఉప్పల్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగి మనీశ్ ఉపాధ్యాయ్, మౌలాలీకి చెందిన విద్యార్థి తాండ్ర స్టాలిన్, తరుణ్‌గోస్వామిగా తేలిందని, వీరు చింతూరు అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి, టేకులపల్లి మీదుగా హైదరాబాద్ వెళ్తుండగా పట్టుపడ్డారని ఎస్‌ఐ వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

పాల్వంచరూరల్: పక్షం రోజుల కిందట మనస్తాపంతో పురుగులమందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి గురువారం రాత్రి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. గుండాల మండలం కాచనపల్లి గ్రామానికి చెందిన ఎరుకల లింగయ్య (40) ఏడాది కిందట బతుకుదెరువు కోసం మండలంలోని మందెరకలపాడు గ్రామానికి ఏడాది కిందట వచ్చాడు. పదిహేను రోజుల కిందట ఇంట్లో భార్యతో గొడవపడటంతో భార్య, ముగ్గురు పిల్లలు పుట్టింటికి వెళ్లారు. మనస్తాపం చెందిన లింగయ్య పురుగులమందు తాగాడు. పాల్వంచ ఏరియాస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడని మృతుడి భార్య శైలజ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,346

అంబరాన్నంటిన సంబురాలు

- ప్రగతి మైదానం, పలు సెంటర్లలో అమరవీరుల స్తూపం వద్ద ఘన నివాళులు
- దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న విప్ రేగా కాంతారావు, ఎమ్మెల్యేలు వనమా, హరిప్రియ, కలెక్టర్ అనుదీప్




జాతీయజెండా ఆవిష్కరిస్తున్న ఎస్పీ వినీత్


కొత్తగూడెంటౌన్: కలెక్టరేట్‌లో నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను శుక్రవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, ప్రజాప్రతినిధుల క్యాంప్ కార్యాలయాల్లో జెండా ఎగురవేశారు. సబ్బండ వర్గాలు ఉత్సవాల్లో పాల్గొన్నాయి. కొత్తగూడెం పట్టణంలో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. కాగా, కలెక్టరేట్‌లో నిర్వహించిన ఉత్సవాల్లో చీఫ్ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు, కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ, కలెక్టర్ అనుదీప్, ఎస్పీ డాక్టర్ వినీత్ పాల్గొన్నారు. తొలుత ప్రగతి మైదానంలోని అమరవీరుల స్తూపానికి, తెలంగాణ తల్లి విగ్రహానికి, బస్టాండ్ సెంటర్‌లోని అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ తల్లికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పరేడ్ మైదానంలో గౌరవ వందనం స్వీకరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్‌ఓ అశోక్‌చక్రవర్తి, డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు.
–కొత్తగూడెంటౌన్


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న రేగా కాంతారావు


కలెక్టర్ అనుదీప్‌తో పలు పాఠశాలల విద్యార్థులు



హైటీ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్


కలెక్టరేట్‌లో పరేడ్ నిర్వహిస్తున్న పోలీసులు


నివాళులర్పిస్తున్న విప్ కాంతారావు, కలెక్టర్


ర్యాలీలో పాల్గొన్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు

డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే సుభిక్షం

- తెలంగాణలో కుటుంబ పాలకు స్వస్తి పలకాలి
- జమ్మూ కశ్మీర్ మాజీ ఉప ముఖ్యమంత్రి నిర్మల్‌కుమార్‌సింగ్


జెండా ఆవిష్కరిస్తున్న నిర్మల్‌కుమార్‌సింగ్


మాట్లాడుతున్న నిర్మల్‌సింగ్‌కుమార్

ఇల్లెందు: తెలంగాణ అభివృద్ధి సాధించి, సుభిక్షంగా ఉండాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని జమ్మూ కశ్మీర్ మాజీ ఉప ముఖ్యమంత్రి, బీజేపీ నాయకుడు డాక్టర్ నిర్మల్‌కుమార్‌సింగ్ అన్నారు. భారత్‌లో అంతర్భాగమైన జమ్మూ కశ్మీర్‌ను తన భూభాగంలోకి కలుపుకోవాలని, దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని పాకిస్తాన్ ఏళ్లుగా ఉగ్రవాదులను తయారు చేసి భారత్‌లోకి చొరబడేలా చేస్తోందని ఆయన తెలిపారు. శుక్రవారం బీజేపీ మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో పర్యటించిన ఆయన ఇల్లెందులో బీజేపీ నేతలతో సమావేశమయ్యారు. తెలంగాణ ఆవిర్భావం సందర్భంగా జెండా ఎగురవేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం కుటుంబ పాలన సాగిస్తోందని, ఈ క్రమంలో ప్రజల కష్టాలు తీరక పోగా కేసీఆర్ కుటుంబం మాత్రం సుఖంగా జీవిస్తోందని ఆరోపించారు. కుటుంబ పాలనకు స్వస్తి పలకాలని, తెలంగాణ అన్ని రంగాల్లో జమ్మూ కశ్మీర్ తరహాలో అభివృద్ధి సాధించాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ రావాల్సిందేనని పేర్కొన్నారు. అమరుల త్యాగాలతో ఏర్పడిన తెలంగాణలో వాగ్దానాలన్నీ విస్మరించారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్ర సర్కార్ ఇక్కడ అమలు చేయడం లేదని విమర్శించారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ, నాళ్ల సోమసుందర్, మిర్యాల వెంకటేశ్వర్లు, బాలగాని గోపీకృష్ణ, ఆకుల నాగేశ్వరగౌడ్, రాంచందర్‌నాయక్, మావునూరి మాధవ్, సుచిత్రపాసి, మురళీకృష్ణ, నాగన్న, అరుట్ల మాధవరెడ్డి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.


వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

భద్రాచలంటౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రజా సంక్షేమ పథకాలు తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకొస్తాయని, వచ్చే ఎన్నికలలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని జమ్మూకశ్మీర్ మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ నిర్మల్‌సింగ్‌కుమార్ జోస్యం చెప్పారు. భద్రాచలం పట్టణంలోని హరితహోటల్‌లో శుక్రవారం జరిగిన భద్రాచలం డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ముందుగా భద్రాద్రి రామయ్యను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరించారు. ఆ తరువాత ఆయన మాట్లాడుతూ.. లిక్కర్ స్కామ్, భూ మాఫియా, అధికార పార్టీ అవినీతిని ప్రజలలోకి తీసుకెళ్లే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలతో పాటు భద్రాద్రి రామయ్యను సైతం మోసం చేశాడని, భద్రాద్రి అభివృద్ధి కోసం ప్రకటించిన రూ.100 కోట్లు ఎక్కడ అని ప్రశ్నించారు. సమావేశంలో కోనేరు సత్యనారాయణ, కుంజా సత్యవతి, బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, త్రినాథ్‌రావు, క్రాంతికుమార్, శ్రీనివాసరావు, రాజుబెహరా, సీతారాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం

పాల్వంచ: మండలంలోని శ్రీ కనకదుర్గ దేవస్థానం (పెద్దమ్మగుడి)లో శుక్రవారం జరిగిన వివాహ వేడుకకు జమ్ముకశ్మీర్ మాజీ డిప్యూటీ సీఎం నిర్మల్ కుమార్‌సింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వధూవరులు జోషికుమార్, నవ్యశ్రీని ఆశీర్వదించారు. అలాగే, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ తదితరులు కూడా హాజరయ్యారు.

పోలీసుల అదుపులో ఒడిశా యువతులు


కారులో ప్రయాణిస్తున్న యువతులు

చండ్రుగొండ: పొట్టకూటి కూసం ఒడిశా రాష్ట్రానికి చెందిన యువతులు తమిళనాడు రాష్ట్రానికి వెళ్తూ మార్గమధ్యలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ పోలీసులకు చిక్కారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం కోరాపుట్‌కు చెందిన 13 మంది యువతులు తమిళనాడు రాష్ట్రంలోని తిరుపూర్‌లోని ఓ దుస్తుల కంపెనీలో పనిచేసేందుకు వెళ్తున్నారు. యువతులు రెండు కార్లు (వాహనాల్లో) బయలు దేరారు. మార్గమధ్యలో ఓ కారు చెడిపోయింది. దీంతో ఒకేకారులో సర్దుకుని ప్రయాణం సాగిస్తున్నారు. ఈ క్రమంలో చండ్రుగొండలోని ఓ పెట్రోల్‌బంకులో కారు ఆపి సేద తీరుతున్నారు. అనుమానం వచ్చిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్‌ఐ విజయలక్ష్మి సిబ్బందితో అక్కడికి చేరుకుని వారిని అదుపులో తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. యువతుల వద్ద ఉన్న కంపెనీ గుర్తింపు కార్డులను పోలీసులు తనిఖీ చేయగా అవి ఓ ప్రముఖ దుస్తుల కంపెనీకి చెందినవిగా ఉన్నాయి. కాగా, ఈ అంశంపై డీఎస్పీ అబ్దుల్ రెహమాన్‌ను వివరణ కోరగా పోలీసులకు పట్టుపడిన యువతులను ఐసీడీఎస్ అధికారులకు అప్పగిస్తామని తెలిపారు. సమగ్ర విచారణ అనంతరం యువతులను పంపిస్తామన్నారు.

ఆదివాసీని అయినందుకే అవమానం

పర్ణశాల సర్పంచ్ తెల్లం వరలక్ష్మి ఆవేదన

చర్ల: ఆదివాసీ మహిళా సర్పంచ్‌ను అయినందుకే తనను ఆదివాసీయేతర పంచాయతీ కార్యదర్శి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవానికి ఆహ్వానించకుండా అవమానించారని, అంతేకాకుండా తన సామాజిక వర్గానికి చెందిన వార్డు సభ్యురాలితో జాతీయ పతాకాన్ని ఎగురవేయించారని పర్ణశాల సర్పంచ్ తెల్లం వరలక్ష్మి ఆరోపించారు. శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం, దశాబ్ది ఉత్సవాల తొలినాడే ఆదివాసీ మహిళా సర్పంచ్ అయిన తనకు అవమానం జరిగిందని, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి తనకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని ఆరోపించారు. అభివృద్ధి పనుల్లో సైతం ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని, ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవానికి హాజరు కావాలని పంచాయతీ గుమస్తాతో కబురు చేశానని, పతాకావిష్కరణ సందర్భంలో తాను స్వయంగా ఫోన్ కూడా చేయగా ఆమె స్పందించలేదని సమాధానమిచ్చారు.

బహిరంగ వేలంపాట వాయిదా

పాల్వంచరూరల్: మండలంలోని కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో వ్యాపార దుకాణాలకు శుక్రవారం నిర్వహించిన బహిరంగ వేలంపాటకు ఎవరూ రాకపోవడంతో 9వ తేదీకి వాయిదా వేసినట్లు ఈఓ ఎస్.రజనీకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బొడ్రాయి వేడుకలు ప్రారంభం


విగ్రహాలతో పూజారి, గ్రామ పెద్దలు

టేకులపల్లి: మండల కేంద్రంలోని దాసుతండాలో బొడ్రాయి, ముత్యాలమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం శుక్రవారం రాత్రి ప్రారంభయ్యాయి. గ్రామపెద్దలు, గ్రామస్తుల ఆధ్వర్యాన శ్రీరంగం అజయ్‌సాయి బొడ్రాయి, ముత్యాలమ్మ విగ్రహాలకు పూజలు చేశారు. ఈ పూజల్లో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైతు వేదికల్లో వేడుకలను విజయవంతం చేయాలి

టేకులపల్లి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవంలో భాగంగా శనివారం రైతు వేదికల్లో రైతులతో జరిగే దశాబ్ది వేడుకలను విజయవంతం చేయాలని తహసీల్దార్ లంకపల్లి వీరభద్రం, ఎంపీడీఓ కోట వీరబాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం బోడులోని రైతు వేదికలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పది సంవత్సరాలు అయిన సందర్భంగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన దశాబ్ది వేడుకలకు రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా రాధ, సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు, ఎంపీఓ గణేశ్ గాంధీ, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఆయిల్ ట్యాంకర్

–ఒకరు మృతి

ములకలపల్లి: ట్రాక్టర్‌ను లారీ (ఆయిల్ ట్యాంకర్) ఢీ కొట్టిన ఘటనలో యువకుడు మృత్యువాత పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. సంజీవ్‌పల్లి గ్రామానికి చెందిన కొర్సా ప్రవీణ్‌కుమార్ తన ట్రాక్టర్ మరమ్మతుల నిమిత్తం అదే గ్రామానికి చెందిన సడియం సంతోష్ (15)తో ట్రాక్టర్‌పై పాల్వంచ వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా పాతూరు సమీపంలో ట్రాక్టర్‌ను ఆయిల్ ట్యాంకర్ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ నడుపుతున్న ప్రవీణ్‌తోపాటు సంతోష్ తీవ్ర గాయలపాలయ్యారు. స్థానికులు గమనించి 108 వాహనంలో క్షతగాత్రులను పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే సంతోష్ మృతిచెందాడు. ప్రవీణ్‌కుమార్ చికిత్స పొందుతున్నాడు. మృతుడి తండ్రి సడియం సత్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తిరుమల్‌రావు తెలిపారు.

క్లుప్తంగా...

తెలంగాణను గుజరాత్‌ని పోల్చి చూద్దామా!

విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి



సూర్యాపేట: 'తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని మీ నేత, ప్రధాని మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌తో పోల్చి చూద్దామా' అని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సవాల్ విసిరారు. డబుల్ ఇంజిన్ సర్కార్లు అంటూ గొప్పలు చెప్పుకుంటున్న బీజేపీ, గుజరాత్‌లో ఒరగబెట్టిందేమీ లేదని దుయ్యబట్టారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో మంత్రి జగదీశ్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ, ఉద్యోగాల కల్పనపై చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. మొత్తం బీజేపీ పాలిత రాష్ట్రాలలో కలిపి కూడా గడిచిన తొమ్మిదేళ్లలో తెలంగాణలో ఇచ్చినన్ని ఉద్యోగాలు కల్పించ లేకపోయారని అన్నారు. సరైన ప్రత్యామ్నాయం లేకనే కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ గెలిచిందన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయం ఉన్న చోట వేరే పార్టీలే విజయం సాధిస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో ఉనికి కోసమే బీజేపీ పడరానిపాట్లు పడుతోందని ఎద్దేవా చేశారు. తెలంగాణ గురించి మాట్లాడే నైతికత కిషన్‌రెడ్డికి లేదన్నారు. బీజేపీ కుట్రలు రాష్ట్రంలో పనిచేయవని, మొత్తం తెలంగాణ సమాజం కేసీఆర్ వెంటే ఉందని అన్నారు.

అరెస్టు చేశాం.. పోలీసు మార్జాలాలు ఉండవు

ఎలాన్ మస్క్ ట్వీట్‌పై ఢిల్లీ పోలీసుల స్పందన

న్యూఢిల్లీ: ట్విట్టర్ అధినేత, బిలియనీర్ ఎలాన్ మస్క్ చేసిన ట్వీట్‌కు ఢిల్లీ పోలీసులు ఇచ్చిన సమాధానం నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. పర్‌ఫెక్ట్ రిప్లై ఇచ్చారంటూ పొగడ్తల్లో ముంచెత్తుతున్నారు. అసలేం జరిగిందంటే.. పోలీసు జాగిలాలు (కుక్కలు) ఉంటాయని మనకు తెలుసు, మరి పోలీసు మార్జాలాలు (పిల్లులు) కూడా ఉంటాయా? అని తన కుమారుడు లిటిల్ ఎక్స్ అడిగాడంటూ మస్క్ గురువారం ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌పై ఢిల్లీ పోలీసు శాఖ శుక్రవారం స్పందించింది. ''హాయ్ ఎలాన్ మస్క్! పోలీసు పిల్లులు ఉండవు. ఎందుకంటే నేరాలు ఘోరాలు చేసినందుకు వాటిని ఎప్పుడో అరెస్టు చేసేశాం. ఈ సంగతి మీ లిటిల్ ఎక్స్‌కు చెప్పండి'' అని ట్వీట్ చేసింది. భలేగా స్పందించారంటూ సోషల్ మీడియాలో నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.





శుక్రవారం గుంటూరు చుట్టుగుంట సెంటర్‌లో 2,562 ట్రాక్టర్లను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఏపీ సీఎం వైఎస్ జగన్

ఇదిగో గ్రామ స్వరాజ్యం

ప్రతి అడుగులోనూ రైతులకు తోడుగా రాష్ట్ర ప్రభుత్వం

- వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద పరికరాల పంపిణీలో ఏపీ సీఎం వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, గుంటూరు : రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలను అన్నివిధాలా చేయి పట్టుకుని నడిపించడంలో భాగంగా రైతన్నలే ట్రాక్టర్లతో కూడిన వ్యవసాయ పనిముట్లన్నింటినీ అతి తక్కువ అద్దెతో మిగిలిన రైతులకు అందుబాటులోకి తేవడం గ్రామ స్వరాజ్యానికి నిజమైన అర్థం అని ఏపీ సీఎం వైఎస్ జగన్ అన్నారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో భాగంగా శుక్రవారం ఆయన గుంటూరు చుట్టుగుంట సెంటర్‌లో రాష్ట్ర స్థాయి రెండో మెగా పంపిణీ కింద రూ.361.29 కోట్ల విలువ గల 2,562 ట్రాక్టర్లు, 100 కంబైన్డ్ హార్వెస్టర్లు, 13,573 ఇతర వ్యవసాయ పనిముట్లను రైతులకు అందజేసే కార్యక్రమాన్ని లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించారు. అంతకు ముందు ట్రాక్టర్‌ను, కంబైన్డ్ హార్వెస్టర్ స్వయంగా నడిపారు. అనంతరం రూ.125.48 కోట్ల సబ్సిడీ సొమ్మును కంప్యూటర్‌లో బటన్ నొక్కి నేరుగా రైతన్నల గ్రూపుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ ప్రతి ఆర్బీకే పరిధిలో ఒక కస్టమ్ హైరింగ్ సెంటర్ కింద రైతులకు కావాల్సిన ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలను అందుబాటులోకి తీసుకు వస్తున్నామన్నారు. ఆ ఆర్బీకే పరిధిలో ఉన్న రైతులే ఒక గ్రూపుగా ఏర్పడి దానిని ఒక కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ కిందకు తీసుకుని వచ్చి, ఆ ఆర్బీకే పరిధిలో ఉన్న మిగిలిన రైతులందరికీ తక్కువ ధరకు ఈ యంత్రాలన్నింటినీ అందుబాటులోకి తీసుకొచ్చే గొప్ప కార్యక్రమానికి తమ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. తద్వారా 10,444 ఆర్బీకేల పరిధిలో రైతులకు ట్రాక్టర్లతో కూడిన వ్యవసాయ పనిముట్లు తక్కువ అద్దెతో అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు.

దామరచర్ల @ 46.8!

నల్లగొండ జిల్లా దామరచర్లలో ఈ వేసవిలోనే అత్యధిక ఉష్ణోగ్రత

- రాష్ట్రవ్యాప్తంగా ఠారెత్తిస్తున్న ఎండలు
- రెండ్రోజులపాటు అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు: వాతావరణ శాఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. వివిధ ప్రాంతాలు నిప్పుల కుంపటిని తలపిస్తున్నాయి. రాష్ట్ర ప్రణాళికా విభాగం సేకరిస్తున్న గణాంకాల ప్రకారం నల్లగొండ జిల్లా దామరచర్లలో శుక్రవారం ఈ వేసవిలోనే అత్యధికంగా 46.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది, అలాగే పెద్దపల్లి జిల్లా ముత్తారంలో 46.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డయింది. మరోవైపు రానున్న రెండ్రోజులు గరిష్ట ఉష్ణోగ్రతలు మరింత పెరగనున్నాయని, వడగాడ్పులు కూడా వీస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ప్రజలు అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం వేళ బయటకు రావొద్దని సూచించింది. ప్రస్తుతం రాష్ట్రానికి వాయవ్య, పశ్చిమ దిశల నుంచి తక్కువ ఎత్తులో బలమైన గాలులు వీస్తున్నాయని పేర్కొంది. శని, ఆదివారాల్లో పలు జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల సెల్సియస్ నుంచి 44 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది. అదేవిధంగా గ్రేటర్ హైదరాబాద్ సమీప జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల నుంచి 41 డిగ్రీల మధ్య నమోదు కావొచ్చని పేర్కొంది.

రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన ప్రాంతాలు

ప్రాంతం	జిల్లా	గరిష్ట ఉష్ణోగ్రత
దామరచర్ల	నల్లగొండ	46.8
ముత్తారం	పెద్దపల్లి	46.4
తంగుల	కరీంనగర్	45.9
మునగాల	సూర్యాపేట	45.7
మహదేవ్‌పూర్	భూపాలపల్లి	45.6

రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం	కేంద్రం	గరిష్టం	కనిష్టం
ఆదిలాబాద్	42.3	25.4	ఖమ్మం	43.2	28.2
భద్రాచలం	42.8	28.5	మహబూబ్‌నగర్	42.0	26.6
హకీంపేట	40.2	26.8	మెదక్	42.3	25.0
దుండిగల్	40.2	27.3	నల్లగొండ	43.0	23.4
హనుమకొండ	41.5	25.0	నిజామాబాద్	43.0	29.9
హైదరాబాద్	40.8	28.4	రామగుండం	42.0	25.6

తెలంగాణ వేడుకలతో సమతాభావం

ఉజ్జయినిలో రాష్ట్ర అవతరణ వేడుకల్లో మధ్యప్రదేశ్ గవర్నర్ మంగూభాయ్ పటేల్



వేడుకల్లో మధ్యప్రదేశ్ గవర్నర్ మంగూభాయ్ పటేల్, ప్రిన్సిపల్ సెక్రటరీ నరహరి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: మధ్యప్రదేశ్‌లో తెలంగాణ వేడుకల నిర్వహణ ఇరు రాష్ట్రాల పౌరుల మధ్య సమతాభావం పెంపునకు దోహదపడుతుందని మధ్యప్రదేశ్ గవర్నర్ మంగూభాయ్ పటేల్ అన్నారు. శుక్రవారం మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కీర్తి మందిర్ విక్రమ్ యూనివర్సిటీ క్యాంపస్‌లో జరిగిన వేడుకలకు గవర్నర్ ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాలను ప్రారంభించారు. 'ఏక్ భారత్–శ్రేష్ఠ భారత్' కార్యక్రమం కింద తెలంగాణ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. తెలంగాణ చరిత్రను తెలిపే లఘుచిత్రాన్ని ప్రదర్శించి, రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. పలు తెలుగు సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే బతుకమ్మ పాటలు, జానపదాలను దాదాపు 1200 మంది కళాకారులు ఉత్సాహంగా ప్రదర్శించారు. అనంతరం ఆ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి, ఉమ్మడి కరీంనగర్ జిల్లావాసి నరహరి మాట్లాడుతూ ఎంతో మంది త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని తెలిపారు.

హస్తినలో ఘనంగా 'తెలంగాణ దశాబ్ది వేడుకలు'

21 రోజుల పాటు జరుగనున్న ఉత్సవాలు

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో తెలంగాణ అవతరణ దశాబ్ది వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మంద జగన్నాథం తెలంగాణ భవన్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. మరో ప్రత్యేక ప్రతినిధి కె.ఎం. సాహ్ని, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్, ఓఎస్డీ సంజయ్ జాజులతో కలిసి తెలంగాణ తల్లి విగ్రహానికి, అమరవీరుల స్తూపానికి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీలోని ఫ్రాన్స్ ఎంబసీ ప్రతినిధి లారెంట్ ట్రిపోనే విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లోనూ 21రోజుల పాటూ ఘనంగా నిర్వహించనున్నట్లు మంద జగన్నాథం తెలిపారు. అనంతరం అతిథులందరూ కలిసి భవన్ ప్రాంగణంలో రాష్ట్ర ప్రగతిపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. అదే విధంగా హెల్త్ క్యాంపును, వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను కూడా ప్రారంభించారు.

తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు..

తెలంగాణ ఆవిర్భావం దినోత్సవాన్ని పురస్కరించుకొని ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల స్తూపానికి, తెలంగాణ తల్లి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఆపై కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

సింగరేణిలో 'గుర్తింపు' కసరత్తు

ఎన్నికల నిర్వహణపై ఈనెల 13న కార్మిక సంఘాలతో సమావేశం



కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయ ముఖద్వారం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కేంద్ర కార్మిక సంక్షేమ శాఖ సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల ప్రక్రియను ప్రారంభించింది. ఇందులో భాగంగా సింగరేణి యాజమాన్యంతో పాటు సంస్థలో రిజిస్టర్ అయిన కార్మిక సంఘాలతో సమావేశాన్ని నిర్వహించనుంది. ఆరు జిల్లాల పరిధిలోని 11 ఏరియాల్లో మొత్తం 24 భూగర్భ గనులు, 18 ఓపెన్ కాస్ట్ గనులు సింగరేణిలో విస్తరించి ఉన్నాయి. ఇందులో మొత్తం 42 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు.

నాలుగేళ్లు పూర్తయినా..

చివరిసారిగా 2017 అక్టోబర్ 5న జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ అనుబంధ కార్మిక సంఘమైన తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీజీబీకేఎస్) గెలుపొందింది. దీని కాలపరిమితి 2021 అక్టోబర్‌తో ముగిసింది. అయితే కరోనా కారణంగా అప్పుడు ఎన్నికల గురించి ఆలోచన చేయలేదు. దీంతో 2022 నవంబర్‌లో ఏఐటీయూసీ నేతలు హైకోర్టును ఆశ్రయించారు. ఈ అంశంపై విచారణ చేపట్టిన హైకోర్టు వెంటనే ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలని డిసెంబర్ చివరి వారంలో సింగరేణిని ఆదేశించింది. అయితే సింగరేణి లేవనెత్తిన కొన్ని అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం జూన్ 1 నుంచి ఆగస్టు 31లోగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలంటూ ఈ ఏడాది మార్చి 29న తుది ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ హైకోర్టు ఆదేశాలను అనుసరిస్తూ డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్(హైదరాబాద్) ఎన్నికల ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈనెల 13న కార్మిక సంఘాలు, యాజమాన్యంతో సమావేశం ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లో జరిగే ఈ సమావేశం అనంతరం ఎన్నికల నిర్వహణ తేదీపై స్పష్టత వస్తుందని కార్మిక సంఘాల నేతలు చెపుతున్నారు.

జిల్లా వార్తలు

గణనీయంగా ఎదిగిన సింగరేణి

తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో డైరెక్టర్ బలరామ్



బహుమతులు అందుకున్న విద్యార్థులతో డైరెక్టర్లు బలరామ్, శ్రీనివాస్, వెంకటేశ్వరరెడ్డి

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ ఏర్పడక ముందు 479 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేసిన సింగరేణి గడిచిన 2022–23లో 39 శాతం వృద్ధితో 671 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణాతో రికార్డు సృష్టించిందని సంస్థ డైరెక్టర్ (పా) ఎన్.బలరామ్ వెల్లడించారు. కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో తెలంగాణ ఆవిర్భావ వేడులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. తొలుత సింగరేణి హెడ్డాఫీస్ ఎదుట పార్క్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి, బస్టాండ్ సెంటర్ సమీపాన అమరవీరుల స్తూపానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాక ముందు రూ.12 వేల కోట్ల టర్నోవర్ కలిగిన సింగరేణి సంస్థ ఈ ఏడాది రూ.33 వేల కోట్లకు ఎదిగిందని చెప్పారు. కాగా, సింగరేణి వ్యాప్తంగా 5వ తేదీన తెలంగాణ దశాబ్ది వేడుకలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం సింగరేణి మెయిన్ వర్క్‌షాపు ఉద్యోగులు, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆ తర్వాత వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. వేడుకల్లో డైరెక్టర్లు ఎన్వీకే.శ్రీనివాస్, వెంకటేశ్వరరెడ్డి, జీఎంలు కుమార్‌రెడ్డి, బసవయ్య, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ నామ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జరిగే రైతు దినోత్సవంలో ఎంపీ పాల్గొంటారు.

ప్రారంభమైన ఫుట్‌బాల్ టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీలు ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. పోటీలను ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సెల్యూకాస్, కె.ఆదర్శ్‌కుమార్ ప్రారంభించి మాట్లాడుతూ.. అండర్–10, 14 పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి 14 జట్లు హాజరయ్యాయని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో వి.మోహన్, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి పచ్చిరొట్ట విత్తనాలు

- ముందస్తు పంట కాలానికి అనుగుణంగా విత్తన పంపిణీ
- 65 శాతం సబ్సిడీపై అమ్మకానికి ఏర్పాట్లు
- సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయం



జీలుగు, జనుము పంట (ఇన్‌సెట్) జీలుగు విత్తనాలు

పచ్చిరొట్ట విత్తనాల ధర (రూ.ల్లో)

విత్తనం	మొత్తం ధర (కిలోకు)	సబ్సిడీ (కిలోకు)	చెల్లించాల్సి ధర బ్యాగ్‌కు	బ్యాగ్ ప్యాకింగ్ (కిలోలు)
జీలుగు	80.25	52.16	842.70	30
పిల్లి పెసర	100.50	65.33	703.40	20
జనుము	87.50	56.88	1224.80	40

ఖమ్మంవ్యవసాయం: పంటల సాగు కాలాన్ని ముందే మొదలుపెట్టేలా ప్రభుత్వం నిర్ణయించగా.. అవసరమైన విత్తనాలను రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ అందుబాటులోకి తీసుకొస్తోంది. ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాలను దృష్టిలో పెట్టుకొని జిల్లాలో ప్రధాన పంట అయిన వరిని నెల ముందుగా సాగు చేయించేందుకు ప్రభుత్వ సూచనలతో అధికారులు సిద్ధమవుతున్నారు. తొలుత భూసారాన్ని పెంచే పచ్చిరొట్ట విత్తనాలను ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని పీఏసీఎస్‌లు, ఆగ్రో రైతు సేవా కేంద్రాల ద్వారా అమ్మకం మొదలుపెట్టారు. పచ్చిరొట్ట విత్తనాలకు 65 శాతం సబ్సిడీ ప్రకటించగా.. ఇప్పటికే 90 శాతం మేర విత్తనాలను రైతుల ముంగిటకు చేర్చారు.

వ్యవసాయ శాఖ ఇండెంట్ ఆధారంగా..

వ్యవసాయ శాఖ ఇండెంట్ మేరకు జీలుగు, పిల్లి పెసర, జనుము విత్తనాలను తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ రైతుల దరికి చేర్చింది. జీలుగు 23,000 క్వింటాళ్లలో ఇప్పటికే 19,800 క్వింటాళ్లు, పిల్లి పెసర 808 క్వింటాళ్లలో 300 క్వింటాళ్లు, జనుము 870 క్వింటాళ్లలో 820 క్వింటాళ్లు పంపిణీ చేశారు. వరి సాగు కాలం నెల ముందుకు రావటంతో రైతులు నారుమళ్లు సాగు చేసే మళ్ల మినహా మిగిలిన భూమిలో పచ్చిరొట్ట విత్తడం ఆనవాయితీ. పచ్చిరొట్టను 30 నుంచి 40 రోజుల పాటు పొలాల్లో పెంచి నాట్లు వేసే సమయానికి భూముల్లో కలియదున్నడంతో భూమిలో సారం పెరుగుతుంది.

సబ్సిడీపై విక్రయాలు

వివిధ పంటల విత్తనాలకు సబ్సిడీ రద్దు చేసిన ప్రభుత్వం పచ్చిరొట్ట విత్తనాలకు మాత్రం కొనసాగిస్తోంది. పంట క్షేత్రాల్లో భూసారాన్ని పెంచే ఈ పంటల సాగును ప్రోత్సహించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ 65 శాతం సబ్సిడీపై విత్తనాలు అమ్ముతున్నారు. జీలుగు 30 కిలోల విత్తన బ్యాగు రూ.842.70కు, పిల్లి పెసర 20 కిలోల బ్యాగ్ రూ.703.40కు, జనుము 40 కిలోల బ్యాగ్‌ను రూ.1,224.80కు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఖమ్మం జిల్లాలో 76 పీఏసీఎస్‌లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 23 పీఏసీఎస్‌ల ద్వారా వరి సాగు చేసే రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాల విక్రయం చేపట్టారు.

డిమాండ్ ఉన్న వరి విత్తనాలు కూడా..

రైతులు ఎక్కువగా సాగు చేసే వరి విత్తనాలను అందుబాటులో తీసుకురావడంపై కూడా విత్తనాభివృద్ధి సంస్థ దృష్టి సారించింది. జూలైలో నార్లు పోసి ఆగస్టు నెలాఖరుకు నాట్లు వేయాల్సి ఉండగా, ఆ కాలాన్ని నెల ముందుకు జరిపారు. దీంతో వరిలో దీర్ఘకాలిక రకాలను జూన్ 5, మధ్య కాలిక రకాలను 15వ తేదీ, స్వల్పకాలిక రకాలను 25వ తేదీలోగా నాటేలా ప్రణాళిక సిద్ధం చేశారు. అయితే, వరి విత్తనాలకు సబ్సిడీ లేకపోగా.. డిమాండ్ ఉన్న విత్తనాలను సరిపడా తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారు. రైతులు సాగుకు ప్రాధాన్యం ఇచ్చే, ప్రభుత్వం కొనుగోలు చేసే ఎంటీయూ–1061 రకం విత్తనాలు ఇప్పటికే సహకార సంఘాలకు, ఆగ్రో రైతు సేవా కేంద్రాలకు చేర్చారు. అలాగే, సన్నం బీపీటీ (5204) సాంబమసూరి రకం 3 వేల క్వింటాళ్ల విత్తనాలు అమ్మకానికి సిద్ధం చేస్తున్నారు. ఇంకా పెసర కూడా ఎంజీజీ–295 రకం 800 క్వింటాళ్లను తీసుకొస్తున్నారు.

కొరత ఎదురుకాకుండా ప్రణాళిక



రైతులకు అవసరమైన విత్తనాల కొరత ఎదురుకాకుండా ప్రణాళికాయుతంగా ముందుకు సాగుతున్నాం. ఇప్పటికే పచ్చిరొట్ట విత్తనాలను ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, ఆగ్రో రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయానికి అందుబాటులోకి తీసుకొచ్చాం. రైతులు ప్రభుత్వం అందించిన రాయితీని వినియోగించుకొని పచ్చిరొట్ట విత్తనాలను కొనుగోలు చేయొచ్చు. అలాగే, వరి, పెసర తదితర విత్తనాలను అందుబాటులోకి తీసుకొస్తున్నాం.

–ఎస్ భీక్షం, ప్రాంతీయ మేనేజర్, విత్తనాభివృద్ధి సంస్థ, ఉమ్మడి ఖమ్మం జిల్లా

రెండో మ్యాచ్‌లోనూ తెలంగాణ విజయం



59 పరుగులు చేసిన నవ్య

ఖమ్మం స్పోర్ట్స్: ఆల్ ఇండియా మహిళా టీ–20 క్రికెట్ టోర్నీ ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో కొనసాగుతోంది. ఈ మేరకు శుక్రవారం ఉత్తరప్రదేశ్‌తో తలపడిన తెలంగాణ జట్టు విజయం సాధించింది. దీంతో రెండు విజయాలు జట్టు ఖాతాలో జమ అయ్యాయి. తెలంగాణ–ఉత్తరప్రదేశ్ జట్ల మధ్య మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న తెలంగాణ జట్టు పరిమిత ఓవర్లలో 217 పరుగులు చేసింది. జట్టులో నవ్య 59పరుగులతో సత్తా చాటించది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన ఉత్తరప్రదేశ్ జట్టు నిర్ణీత ఓవర్లలో కేవలం 78 పరుగులే చేయడంతో ఓటమి పాలైంది. ఆతర్వాత గుజరాత్–మహారాష్ట్ర జట్ల నడుమ మ్యాచ్‌లో గుజరాత్ పరిమిత ఓవర్లకు 74 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్ చేసిన మహారాష్ట్ర జట్టు లక్ష్యాన్ని సునాయసనంగా చేధించి విజయం సొంతం చేసుకుంది. కాగా, శనివారం నుంచి నాకౌట్ మ్యాచ్‌లు జరుగుతాయని టోర్నీ చైర్మన్ డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.డీ.మతిన్ తెలిపారు.

దశాబ్ద కాలంలో వేగంగా గిరిజనాభివృద్ధి

అవతరణ ఉత్సవాల్లో ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు



ఐటీడీఏలో జాతీయజెండా ఆవిష్కరిస్తున్న పీఓ గౌతమ్ పొట్రు

భద్రాచలం: ఎందరో అమరుల త్యాగాలతో సాధించుకున్న తెలంగాణ ఏర్పడిన పదేళ్ల కాలంలో గిరిజనుల అభివృద్ధి వేగంగా జరుగుతోందని ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో ఆయన అమరవీరుల స్తూపం, తెలంగాణ తల్లి విగ్రహానికి నివాళులర్పించాక జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఆశ్రమ, ఉన్నత ప్రాథమిక ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, కళాశాలల సంఖ్య పెరగగా, ప్రస్తుతం 24,587 మంది విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. అలాగే, ఉపకార వేతనాలు అందించడంతో పాటు రెండు క్రీడా పాఠశాలలు ఏర్పాటుచేసినట్లు చెప్పారు. ఇంకా మూడు వైటీసీల ద్వారా నిరుద్యోగ యువతకు ఇస్తున్న ఉచిత శిక్షణతో అనేక మంది ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ఇంకా ట్రైకార్ ద్వారా నిరుద్యోగ, నిరుపేద గిరిజనులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. కాగా, రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 17న నిర్వహించే గిరిజన సంబరాల్లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పీఓ కోరారు. కార్యక్రమంలో ఏపీఓ (జనరల్) ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ, డీడీ డేవిడ్‌రాజ్, అధికారులు తానాజీ, భీమ్, విజయ్‌కుమార్, భాస్కర్, సురేశ్‌బాబు, అశోక్‌కుమార్, ఆర్.శ్రీనివాస్, ప్రభాకర్‌రావు, ఆదినారాయణ, రమణయ్య, నర్సింగ్‌రావు, హరికృష్ణ పాల్గొన్నారు.

ఇంకా ఖమ్మం క్వార్టర్‌కు అద్దె కడుతున్నా..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, పక్కన ప్రజాప్రతినిధులు, నాయకులు

- పొంగులేటి, మమత సొసైటీలకు వేలాది గజాలు రెగ్యులర్ చేశారు
- సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లిరూరల్: నోటికొచ్చినట్టు తనపై తప్పుడు విమర్శలు చేస్తే సహించేది లేదని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పేర్కొన్నారు. ఖమ్మం ఎన్నెస్పీ క్వార్టర్‌లో ఉంటున్నందుకు ప్రతినెలా రూ.5 వేలు అద్దె చెల్లిస్తున్నానని స్పష్టం చేశారు. సత్తుపల్లిలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. క్వార్టర్‌కు అద్దె కడుతున్నప్పటికీ కొందరు రెగ్యులర్ చేయించుకున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఖమ్మంలో స్థలాలు రెగ్యులర్ చేసుకున్నవాళ్ల రేషన్ బియ్యానికి గతి లేని వాళ్లా అని ప్రశ్నించారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి, మమత సొసైటీ, హార్వెస్ట్ సొసైటీ, ఇతర విద్యాసంస్థల సొసైటీలకు వేలాది గజాల ప్రభుత్వ స్థలాలను రెగ్యులర్ చేశారని తెలిపారు. ప్రభుత్వ స్థలాలు రెగ్యులర్ చేయడంలో తాను మొదటి వాడిని, చివరి వాడిని కాదని.. ఎవరికైనా సందేహాలు ఉంటే తాను అద్దె చెల్లించిన రశీదులు పరిశీలించుకోవాలని సూచించారు.

నేడు కొత్తూరు నుంచి కాకర్లపల్లి వరకు ర్యాలీ

తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం కొత్తూరు రైతువేదిక నుంచి కాకర్లపల్లి వరకు భారీ సంఖ్యలో రైతులతో కలిసి ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వెంకటవీరయ్య తెలిపారు. ఈ మేరకు రైతులు, పార్టీ శ్రేణులు హాజరుకావాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, నాయకులు వనమా వాసు, చల్లగుండ్ల కృష్ణయ్య, అద్దంకి అనిల్, ఎస్కే మౌలాలి, కృష్ణారావు, ఎండీ గఫార్‌ఖాన్, గుండ్ర రాఘవేంద్రరావు, మేకల కృష్ణ, ఎండీ అబ్దుల్లా పాల్గొన్నారు.